క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోయిల్‌కొండ: మండలంలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. పరిసర గ్రామాలు అంకిళ్ల, అయ్యవారిపల్లిని సందర్శించారు. అలుగుపారేందుకు సిద్ధంగా ఉన్న దమాయపల్లి చెరువును చూశారు. మండలంలో 6 గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న ఆరు ఇళ్లను గుర్తించి వారిని ఇతర ఆవాసాలకు తరలించారు. ప్రజలు వీలైనంతవరకు బయటకు రాకుండా చూడాలన్నారు.

టార్పాలిన్ కవర్ల పంపిణీ



అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు టార్పాలిన్ కవర్లను పంపిణీ చేశారు. పెంకుటిళ్లు, మట్టి ఇళ్లల్లో నివసించే వారు తుఫాను మూలంగా ఇబ్బందులు పడకుండా పైకప్పులపై కప్పడానికి జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్లాస్టిక్ కవర్లను పంపడంతో వాటిని స్థానిక నాయకులు గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, రమేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మిడ్జిల్: వీఆర్‌ఏలకు పేస్కేల్, జీఓ విడుదల చేసిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏల జేఏసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాజీవ్‌రెడ్డి, శ్రీశైలం, కరుణాకర్, శ్రీను, శివప్రసాద్, ఖాసీం, నాగమణి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు పంపిణీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్ (హన్వాడ): హన్వాడ మండలం పల్లెమోనికాలని గ్రామానికి చెందిన అంజిలయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల రైతుబీమా చెక్కును మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గురువారం భార్య పద్మమ్మకు అందించారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, తేజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పంచాయతీ కార్మికుల కలెక్టరేట్ ముట్టడి నేపథ్యంలో జిల్లా జేఏసీ చైర్మన్ నల్లవెల్లి కురుమూర్తిని అక్రమంగా ముందస్తు అరెస్టు చేసి గృహ నిర్బంధం చేయడం, ఆ తర్వాత స్టేషన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్ ప్రకటనలో తెలిపారు. నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని, మరింతగా ఉద్యమాలను ఉధృతం చేసేందుకు ఈ అక్రమ అరెస్టులు దోహదపడుతాయని పేర్కొన్నారు.

మెడికల్ షాపుల బంద్

దేవరకద్ర: మండల కేంద్రంలోని మెడికల్ షాపులను గురువారం ఉదయం మూసివేశారు. దశాబ్దాలుగా అందరి మన్ననలు పొందిన మెడికల్ షాపు కృష్ణయ్య గురువారం తెల్లవారు జామున గుండెపోటుతో హజిలాపూర్‌లో మృతి చెందారు. మెడికల్ షాపుల యజమానులు హజిలాపూర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి ఘనంగా నివాళులు అర్పించారు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

బాలానగర్: ఎస్టీ రిజర్వేషన్ల జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని బీజేపీ ఎంపీ సోయం బాబురావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని గిరిజన సంఘం నాయకుడు లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందునే గోండ్రు, లంబాడాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధిపొందాలని చూస్తున్నారని అలాంటి వారి ఆటలు సాగవని పేర్కొన్నారు.

కూలిన ఇళ్ల పరిశీలన



మహబూబ్‌నగర్ న్యూటౌన్ (హన్వాడ): మండలంలోని వేపూరులోని వర్షాలకు కూలిన, దెబ్బతిన్న ఇళ్లను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్ పరిశీలించారు. గురువారం గ్రామంలో పర్యటించిన ఆయన తక్షణ ఆర్థిక సాయాన్ని అందించారు. వర్షాల గ్రామంలో 5 ఇళ్లు కూలాయని, బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ పరామర్శ

మిడ్జిల్: మాదిగ ఉద్యోగుల సంఘం నాయకుడు గడ్డల కృష్ణయ్య ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో గురువారం ఎమ్మెల్సీ గోరటి వెంకన్న వాడ్యాల్‌లో ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సుధాకర్, తిరుపతయ్య, నర్సింహులు, మధు, తదితరులు ఉన్నారు.

ఎక్కడి వరదనీరు అక్కడే!



దేవరకద్రలో మోటారుతో నీటిని బయటికి తోడుతున్న దుకాణదారుడు



జీకేరెడ్డికాలనీలో వర్షపునీటిని నాలాలోకి వెళ్లేలా చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లా కేంద్రంలోని రోడ్లపై ఎక్కడికక్కడే వరద, మురుగు నిలుస్తుంది. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది.

అప్రమత్తంగా ఉండాలి..

జడ్చర్ల: వరుసగా కురుస్తున్న వర్షాలతో వాగులు నిండుగా పారుతుండడంతో పరివాహక ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు ఎస్పీ రాములు తెలిపారు. గురువారం మండలంలోని కోడ్గల్, కొండేడు, లింగంపేట గుండా ప్రవహిస్తున్న దుందుబీ వాగును ఆయన డీఎస్పీ మహేష్‌తో కలిసి పరిశీలించారు.

పరిసర ప్రాంతాలకు వెళ్లొద్దు..

మిడ్జిల్: దుందుబి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఎవరు వెళ్లొద్దని సీఐ జములప్ప సూచించారు. గురువారం మండలంలోని వస్పుల, కొత్తూర్ సమీపంలోని దుందుబీ వాగును సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్తూర్– వెలుగొమ్ముల మధ్యలో వాగు దాటాల్సి ఉండడంతో అధికారులు ముందు జాగ్రత్తగా రాకపోకలను తాత్కాలికం నిలిపివేశారు.

అలుగులు పారుతున్న చెరువులు..

నవాబుపేట: వానలతో చెరువులు అలుగులుపారుతున్నాయి. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గురువారం అధికారుల బృందం మండలంలోని ఇప్పటూర్ లెంకల చెరువు, చెన్నరెడ్డిపల్లి పెద్ద చెరువు, యన్మన్‌గండ్ల పెద్ద చెరువులను వారు పరిశీలించారు.

దుకాణాల్లోకి వర్షపు నీరు..

దేవరకద్ర: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాయిచూర్ రోడ్డులోని పలు దుకాణాల్లోకి వర్షం నీరు వచ్చి చేరింది. నీటిని మోటార్లతో తోడారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 57 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సబ్ స్టేషన్ ప్రాంతం నుంచి కాల్వలో వస్తున్న నీటిని మల్లెల పాపయ్య కుంటలోకి మళ్లించారు.

గండేడ్: మండలంలోని సాలార్‌నగర్ ప్రాజెక్టు ఇటీవల నిండింది. వెన్నాచేడ్ పెద్ద చెరువులో వర్షం నీరు చేరుతుంది. అలుగు పారడానికి 13 ఫీట్లు నీరు అవసరం ఉండగా ఇప్పటికే 9 ఫీట్లు నీరు వచ్చి చేరింది.



అలుగు పారుతున్న బ్రాహ్మణ్ చెరువు

మహమ్మదాబాద్: గాధిర్యాల్, మహమ్మదాబాద్, చౌదర్‌పల్లి, మంగంపేట్‌లో చెరువులు, కుంటలు నిండుతున్నాయి. గురువారం బ్రాహ్మణ్ చెరువు అలుగు పారుతుంది.

అడ్డాకుల: మండలంలోని వర్నె వద్ద వాగులో మట్టి దారి కొట్టుకుపోయిన ప్రాంతాన్ని గురువారం సాయంత్రం అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ కిషన్, ఎస్‌ఐ మాధవరెడ్డి వాగు వద్దకు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. ప్రజలెవరూ వాగులను దాటొద్దని సూచించారు.

అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి

జడ్చర్ల: అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో చిన్న ఆదిరాల, బొమ్మరాసిపల్లికి చెందిన వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.



కండువా వేసి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

గార్లపాడ్‌ను మండలంగా ప్రకటించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కోయిల్‌కొండ మండలంలోని గార్లపాడ్‌ను మరో మండలంగా ప్రకటించాలని పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ రవినాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 196 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. అన్ని గ్రామాలకు మహబూబ్‌నగర్ పోయే రోడ్డు మార్గంలో ఉండటం, గార్లపాడ్ సొసైటీ బ్యాంక్, ప్రభుత్వ హాస్పిటల్ కూడా ఉన్నాయని వివరించారు. మండలం కావాలని 16 పంచాయతీల తీర్మానాలు ఉన్నాయని పేర్కొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరిస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో నెలకొన్న మురుగు సమస్యను పరిష్కరిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వచ్చే ఏడాది నాటికి అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. గురువారం స్థానిక పదోవార్డు పరిధిలోని ఎస్‌ఆర్ నగర్, విఘ్నేశ్వరకాలనీ, శ్రీరామకాలనీ, ఆదర్శకాలనీ, అయోధ్యనగర్‌లలో రూ.4.73 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. అన్ని రకాల అనుమతి తీసుకున్నాకే ఇంటి నిర్మాణం చేపట్టాలని ప్రజలకు సూచించారు. అనంతరం మినీ ట్యాంకుబండ్‌ను మంత్రి పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పెద్దచెరువు లోకి నిండా నీరు చేరి కళకళలాడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అబ్దుల్‌కలాం జీవితం ఆదర్శం..

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అబ్దుల్ కలాం జీవితమంతా దేశ సేవకే అంకితం చేశారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కలాం వర్ధంతి సందర్భంగా న్యూటౌన్, ఆర్‌వీఎం ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్రపతి అయినా అత్యంత సాధారణజీవితం గడిపారని తెలిపారు.



మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ..

మహబూబ్‌నగర్ న్యూటౌన్(హన్వాడ): హన్వాడ మండలం చిన్నదర్పల్లి సమీపంలో చిర్మల్‌కుచ్చతండా వద్ద ఇటీవల నీటి గుంతలో పడి చనిపోయిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేశారు.

అబ్దుల్‌కలాంకు ఘన నివాళి



జడ్చర్లలో అబ్దుల్ కలాంకు నివాళి అర్పిస్తున్న చిన్నారులు



మహమ్మదాబాద్‌లో..

జడ్చర్ల టౌన్: అబ్దుల్‌కలాం వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలో ఘన నివాళి అర్పించారు. ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి, మౌనం పాటించారు. కార్యక్రమంలో సొసైటి అధ్యక్షురాలు బాలమణి, శిరీష, అంజమ్మ, రజిత, రాధాకృష్ణ, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో చిన్నారుల నివాళి..

పట్టణంలోని గౌరిశంకర్ కాలనీలో చిన్నారులు అబ్దుల్‌కలాంకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలు ప్రతి ఒక్కరికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే చిన్నారులకు వివరిస్తూ నివాళులు అర్పించినట్లు కాలనీ యువకులు తెలిపారు.

సేవలు చిరస్మరణీయం..

మహమ్మదాబాద్: అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం అని మాజీ ఎంపీపీ శాంతి పేర్కొన్నారు. వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సురేష్, ఇంతియాజ్, వెంకటయ్య, రజాక్, శ్రీనివాస్, దస్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: అబ్దుల్‌కలాం వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలో ఘననివాళి అర్పించారు. ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు బాలమణి, శిరీష, అంజమ్మ, రజిత, రాధాకృష్ణ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు

మహబూబ్‌నగర్ రూరల్: వర్షాలకు మండలంలోని మాచన్‌పల్లి, పోతన్‌పల్లి, కోడూర్, వెంకటాపూర్, రేగడిగడ్డ తండాలలో ఒక్కొక్కటి చొప్పున ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. తహసీల్దార్ పాండు రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం ఆయా గ్రామాలలో పర్యటించి ఇళ్లను పరిశీలించారు. తెలుగుగూడెం, మాచన్‌పల్లి గ్రామాలకు వెళ్లే రహదారులపై వరద నీరు ప్రవాహం ఉండటంతో ముందు జాగ్రత్త చర్యగా ఆయా రహదారుల్లో రాకపోకలను నిలిపివేయించారు. కోడూర్‌లో సర్పంచ్ శ్రీకాంత్‌గౌడ్ మట్టిమిద్దెలు, పాత ఇండ్లలో నివాసం ఉంటున్న వారి దగ్గరకు వెళ్లి పరిశీలించారు.

మహబూబ్‌నగర్ అర్బన్‌లో...

అర్బన్ మండలంలో ఏనుగొండ, అప్పన్నపల్లి, టీడీగుట్ట ప్రాంతాలలో వర్షానికి మూడు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. ఆయా ప్రాంతాలలో గిర్దావర్ నర్సింగ్ రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారుడికి న్యాయమూర్తి జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ తబిక్ జిల్లా కేంద్రంలో పట్టుబడ్డాడు. అతనిని గురువారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిర్మల నాలుగు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

సీఐటీయూ నాయకులపై కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: కలెక్టరేట్ ఎదుట అనుమతి లేకుండా ధర్నా చేసిన సీఐటీయూ నాయకులపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రెగ్యులర్ చేయాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరుతూ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఉద్యోగులు గురువారం వినతిపత్రం అంజేశారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. మంత్రి స్పందిస్తూ అందరికి న్యాయం చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాసులు, యాదగిరి, శేఖర్‌గౌడ్, రఘుబాబు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

30న మందకృష్ణమాదిగ రాక



జడ్చర్ల టౌన్: పట్టణానికి ఈనెల 30న ఆదివారం మందకృష్ణమాదిగ రానున్నట్లు ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ జంగయ్య తెలిపారు. గురువారం పట్టణంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 2వ వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభ విజయంతం చేయాలని నిర్వహిస్తున్న సన్నాహక సభకు ఆయన హాజరవుతారని, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వినోద్, కిరణ్, యాదయ్య పాల్గొన్నారు.

రెండు నాగుపాముల పట్టివేత



సదాశివయ్య పట్టుకున్న నాగుపాము

జడ్చర్ల టౌన్: పట్టణంలో సర్పరక్షకుడు డా.సదాశివయ్య గురువారం రెండు నాగుపాములను పట్టుకున్నారు. ఉదయం మహ్మద్‌సల్మాన్ చెందిన ఇంట్లోకి ఆరు అడుగుల పాము రాగా సదాశివయ్యకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకుని దానిని పట్టుకున్నారు. ఫిమేల్ కోబ్రా చాలా ప్రమాదకరమైనదిగా ఆయన తెలిపారు. సాయంత్రం బోయిలకుంట రోడ్డులోని రవీందర్ రైస్‌మిల్‌లోకి వచ్చిన 7అడుగుల నాగుపామును పట్టుకున్నారు. ఇటీవల కాలంలో ఇంతపెద్ద కోబ్రాలను పట్టుకోవటం ఇప్పుడేనని ఆయన తెలిపారు. ఆలంపల్లి ప్రదీప్ గృహంలో మరో పామును ఆయన పట్టుకున్నారు. వర్షాకాలం కావటం వల్ల పాముల బెడద అధికంగా ఉంటుందని, కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రోడ్డుపై నాటు వేసి నిరసన

జడ్చర్ల టౌన్: మండలంలోని బూర్గుపల్లి–ఆలూరు మధ్య ఉన్న రోడ్డు బురదమయం కావటంతో బీసీ సేన యువకులు వరినాటు వేసి నిరసన వ్యక్తం చేశారు. నిత్యం బూర్గుపల్లి నుంచి ఆలూరుకు విద్యార్థులతోపాటు రైతులు, భూత్పూర్, దివిటిపల్లి నుంచి సైతం పెద్ద సంఖ్యలో ఈ మార్గం వినియోగిస్తుంటారని బీసీసేన జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఇలాంటి రోడ్డు మరమ్మతులు చేయకుండా ఉన్నారని, వర్షాలకు పూర్తిగా బురదమయంగామారి రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వాపోయారు. వెంటనే రోడ్డు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామస్వామి, రఘు, చంద్రమౌళి, నిరంజన్, భీమయ్య, ప్రకాష్ ఉన్నారు.



నాటు వేస్తున్న బీసీ సేన నాయకులు

వర్షాకాలంలో జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి



డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న డీఎం సుజాత

స్టేషన్ మహబూబ్‌నగర్: వర్షాకాలంలో తగిన జాగ్రత్తలతో డ్రైవింగ్ చేయాలని డీఎం సుజాత తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఆర్టీసీ డిపో మేనేజర్ డ్రైవర్లకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. వాగులు, వంతెనల వద్ద డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. మెయింటెనెన్స్ సిబ్బంది అన్ని బస్సులకు వైపర్స్, హెడ్‌లైట్స్, రూఫ్ లీకేజీ లేకుండా, షట్టర్ గ్లాసెస్ పూర్తిగా పనిచేసేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాంజీ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

పాదయాత్రకు తరలిరండి

మిడ్జిల్: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి చేపట్టిన ప్రజాహిత పాదయాత్రకు మండల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని టీపీసీసీ కార్యదర్శి రబ్బాని పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి ఇంట్లో ఏర్పాటు చేసిన మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం పాదయాత్ర మండలంలోని సింగందొడ్డిలోకి ప్రవేశిస్తుందని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి పాదయాత్రకు స్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్‌రెడ్డి, సంపత్, గౌస్, రాజిరెడ్డి, నర్సింహులు, శ్రీనునాయక్, సత్యం, జహంగీర్, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రబ్బాని

మాల ఉద్యోగులను వేధిస్తే సహించం



మాట్లాడుతున్న దుమార్ల నిరంజన్

మహబూబ్‌నగర్ రూరల్: రంగారెడ్డి జిల్లా నాదుర్గుల్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మామిడే నారాయణ అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని జాతీయ మాలల ఐక్యవేదిక ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుమార్ల నిరంజన్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి కారణం లేకుండా సంగారెడ్డి జిల్లా గురుకులానికి బదిలీ చేయడంతో తన అనారోగ్య రీత్యా బదిలీపై వెళ్లలేనని ఉన్నతాధికారులకు విన్నవించుకోవడం జరిగిందని తెలిపారు. దానిపై స్పందించకుండా ఉద్యోగుల సర్వీస్ రూల్స్ పాటించకుండా సస్పెన్షన్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గురుకులంలో మాల ఉద్యోగస్తులను వేధించడం మానుకోకపోతే ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

బీబీఫాతిమా దర్శనానికి బారులు

కోయిల్‌కొండ: రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన మొహర్రం ఉత్సవాల్లో 8వ రోజు కోటపై ప్రతిష్ఠించిన బీబీఫాతిమా దర్శనానికి వర్షానికి కూడా లెక్క చేయకుండా భక్తులు తరలివచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి వాహనాల్లో తరలించి కందూర్లతో మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలు రెండు రోజుల్లో ముగుస్తున్నందునా భక్తులు పోటెత్తారు. శుక్రవారం అర్ధరాత్రి అగ్నిగుండం, బీబీఫాతిమా పీరు ఊరేగింపు సందర్భంగా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం తెల్లవారుజామున ఖాసీమ్‌సాబ్ పీర్ల సవారి ఆకట్టుకుంది.

మిడ్జిల్: మండలంలో మొహర్రం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం మండల కేంద్రంతో పాటుగా వాడ్యాల్, బోయిన్‌పల్లి, కొత్తూర్‌లో కొన్ని పీర్లను ఊరేగింపు నిర్వహించారు. వేడుకలలో వర్షనికి సైతం యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బీబీఫాతిమా పీర్లు

సబ్సిడీ గొర్రెల విక్రయం?

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో ఇటీవల ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన గొర్రెలను కొందరు కాపరులు విక్రయించినట్లు తెలిసింది. గ్రామానికి చెందిన ఆరుగురు కాపరులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15న రాయితీపై గొర్రెలను అందుకున్నారు. ఇందులో ఒకరిద్దరు మినహా మిగిలిన వారు గొర్రెలను వనపర్తి జిల్లా పెద్దమందడి మండలానికి చెందిన వారికి విక్రయించినట్లు సమాచారం. అయితే గొర్రెలను కొనుగోలు చేసిన వారు కాపరులకు ఇంకా డబ్బులు ఇవ్వకపోవడంతో ఈ విషయం గురువారం బయటకు పొక్కింది. మండలంలోని మరి కొన్ని గ్రామాల్లో కూడా ఇటీవల వచ్చిన గొర్రెలను విక్రయించినట్లు తెలిస్తుంది. దీనిపై మండల పశువైద్యాధికారి మధుసూదన్‌ను సంప్రదించగా.. కొందరు లబ్ధిదారులు సబ్సిడీ గొర్రెలను విక్రయించినట్లు తెలిసిందన్నారు. గొర్రెలను పంపిణీ చేయడం వరకే తమ బాధ్యత ఉంటుందన్నారు. దీనిపై జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పీఎఫ్ సభ్యత్వం జీవనానికి భరోసా



ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న నోడల్ ఆఫీసర్ రమేస్ చావా

మహబూబ్‌నగర్ క్రైం: ప్రావిడెంట్ ఫండ్ సభ్యత్వంతో తమ రిటైర్డ్ జీవనానికి భరోసా కల్పిస్తుందని హైదరాబాద్ బర్కత్‌పుర భవిష్యనిధి కార్యాలయ జిల్లా నోడల్ ఆఫీసర్ రమేష్ చావా అన్నారు. జయరామ మారుతీ మోటార్స్ లిమిటెడ్ షోరూంలో గురువారం పీఎఫ్ ఖాతాదారుల సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిధి ఆప్‌కే నిక్కడ్-2.0 కార్యక్రమం ద్వారా ఖాతాదారుల సమస్యలను పరిష్కారిస్తున్నామన్నారు. అదనంగా పలు రకాల ప్రయోజనాలను ఉంటాయని, ఈడీఎల్‌ఐ స్కీంలో భాగంగా పీఎఫ్ సభ్యులు ఏకంగా రూ.7లక్షల వరకు ఉచితంగానే ఇన్సూరెన్స్ లభిస్తుందన్నారు. సదస్సులో దాదాపు 80మంది ఖాతాదారుల సమస్యలను పరిష్కరించామన్నారు. కొందరి సభ్యులకు సంబంధించిన జీవన్ ప్రమాణ్ చేశామన్నారు. కార్యక్రమంలో నరేష్, షేక్ నజీర్, నవీన్‌కుమార్, రాజసింహుడు పాల్గొన్నారు.

ఆర్టీసీ రాయితీని సద్వినియోగం చేసుకోండి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ రాయితీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. నాగర్‌కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్ వరకు వెళ్లే పల్లెవెలుగు బస్సులో గురువారం ఆర్‌ఎం ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా టీ9–30 టికెట్ గురించి ప్రయాణికులకు వివరించారు. రోజువారి ప్రయాణించేవారికి ఈ టికెట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రూ.50లతో కొనుగోలు చేస్తే పల్లె వెలుగు బస్సుల్లో 30 కిలోమీటర్ల వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రాను, పోను వెసులుబాటు లభిస్తుందన్నారు. ఈ టికెట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.10 నుంచి రూ.30 వరకు ఆదా అవుతుందని వివరించారు. తిరుగుప్రయాణంలో రూ.20 కాంబి టికెట్ తీసుకొని ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ప్రయాణించవచ్చని తెలిపారు. అనంతరం ఆర్‌ఎం పలువురికి టీ9–30 టికెట్ అందజేశారు.



టీ9–30 టికెట్ అందజేస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి

మహిళలకు ఉచిత శిక్షణ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతోపాటు వసతి సౌకర్యం, యూనిఫాం, టూల్‌కిట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 9491380107 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రతిభా పురస్కారాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదివి ఎస్సెస్సీలో అధిక జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను శుక్రవారం అందజేస్తున్నట్లు అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.